క్లుప్తంగా

23న మండల సమావేశం

ముంచంగిపుట్టు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నెల 23న నిర్వహించనున్నట్టు ఎంపీడీవ సూర్యనారాయణ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు సమక్షంలో మూడు నెలల పాటు జరిగిన అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై శాఖల వారీగా సభ జరుగుతుందని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో విధిగా సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని, గైర్హాజరైన అధికారులకు శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన చెప్పారు.

దివ్యాంగులకు ఉపకరణాల గర్తింపు శిబిరం



రంపచోడవరంలో శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులు

రంపచోడవరం: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించినట్లు ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర తెలిపారు. రంపచోడవరం నుంచి 66, దేవీపట్నం నుంచి 82 మంది, గంగవరం నుంచి 18 మందిని గుర్తించామన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉపాధి శిక్షణ కోసం 45 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. జిల్లా దివ్యాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న సర్పంచ్ సంతోష్

వి.ఆర్.పురం: మండలంలోని చొక్కనపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల గిరిజనుడు తోడం రాంబాబు పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న ధాన్యం, 5 క్వింటాళ్ల మిర్చి, దుస్తులు, టీవీ ఇతర సామాన్లన్నీ కాలి బూడిదయ్యాయి. సంఘటన స్థలాన్ని సర్పంచ్ పులి సంతోష్ పరిశీలించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన నిరుపేద బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే సాయమందించాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకొని నష్ట పరిహారం అందేలా ఉన్నతాధికారులు చూడాలని స్థానికులు టి.రాజు, టి.చిన బుబ్బమ్మ, పీసా కమిటీ కార్యదర్శి అనిల్, సీతమ్మ తదితరులు కోరారు.

కండ్రూమ్‌లో గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ హరి

డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుమ్ పంచాయతీలో సర్పంచ్ కె.హరి ఆధ్వర్యంలో గ్రామ సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హరి మాట్లాడుతూ పంచాయతీలో నెలకొన్న సమస్యలు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధి పథకం ద్వారా చేయనున్న భూమి చదును, ఫారంపాండ్, పశువుల తొట్టెల నిర్మాణం తదితర పనులపై చర్చించారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్, వైస్ సర్పంచ్ ప్రతిమ, వార్డు సభ్యులు బలరామ్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా దోమల మందు పిచికారీ



లంగుపర్తిలో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

అడ్డతీగల: ఇంటింటా దోమల నివారణ మందు పిచికారి చేయించుకోవాలని ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగప్రత్యూష అన్నారు. లంగుపర్తిలో సోమవారం పిచికారీ పనులను ప్రారంభించారు. ప్రతి ఒక్క ఇంట్లోను దోమల మందు పిచికారీ చేసేలా సహకరించాలన్నారు. ఎల్లవరం పీహెచ్‌సి పరిధిలో 18 గ్రామాల్లో 1,577 గృహాల్లో మందు పిచికారీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎంపీహెచ్‌ఈవో శ్యాం బాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అశోక్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెతలు తీరేనా?



బస్సు సేవలకు నోచుకోని కుమడ జామిగుడ రోడ్డు



సుమారు 25 కిలోమీటర్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తారురోడ్డు నిర్మాణం జరిగింది. అలాగే గుల్లేలు నుంచి గిన్నెలకోట, ఇంజరి మీదుగా కోంద్రుం వరకు తారురోడ్డు నిర్మాణం జరిగింది. పాడేరు మండలం గుత్తులపుట్టు నుంచి బంగారుమామిడి వరకు తారురోడ్డు నిర్మాణం జరిగింది. అయితే ఈ రోడ్డును ఆనుకుని వందల సంఖ్యలో గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీరు నిత్యం మండల కేంద్రం, జిల్లా కేంద్రాలకు వివిధ పనులు నిమిత్తం ప్రయాణాలు చేయడానికి ప్రయివేటు రవాణా తప్పి ఆర్టీసీ సేవలు అందుబాటులో లేవు. దీంతో ప్రమాదకర ప్రయాణం అని తెలిసిన ప్రయాణం చేయాల్సి వస్తుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంతాలకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సేవలు కల్పించాలని పలు మార్లు కలెక్టర్, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేకుండా పోయిందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెదబయలు: అల్లూరి జిల్లాలో గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మారుమూల గ్రామాలకు తారురోడ్ల నిర్మాణం చేసి ప్రజల దశాబ్దాల నాటి కలను నిజం చేశారు. ఈ మేరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రూపాయలతో మారుమూల గ్రామాలకు సైతం అద్దంలా తారురోడ్లు అందుబాటులోకి వచ్చాయి. రహదారులు పూర్తయినా కూటమి ప్రభుత్వం ఆర్టీసీ సేవలు అందించడం లేదు. దీంతో రోజూ ప్రజలు ప్రైవేట్ జీపులు, ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రైవేట్ వాహనాల్లో



జామిగుడలో జీపు టాప్‌పై ప్రయాణికులు

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. వాహన డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ వాహన డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడవంతో అమాయక గిరిజనులు మృత్యువాతకు లేక తీవ్ర గాయాల బారిన పడుతున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసు లేక గత్యంతరం లేక ఆయా గ్రామస్తులకు ప్రమాదకర ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పెదబయలు మండలం రూడకోట పంచాయతీ కేంద్రం నుంచి ఒడిశా సరిహద్దు వరకు

ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూడకోట నుంచి జామిగుడ ఒడిశా సరిహద్దు వరకు రూ.20 కోట్లలో తారురోడ్డు నిర్మాణం జరిగింది.ఈ రోడ్డుకు ఆనుకుని పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలు, ఒడిశా కలుపుతూ వందల గ్రామాలు ఉన్నాయి. బస్సు సదుపాయం కల్పించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు కోరినా ఫలితం లేదు. అనేకమార్లు కలెక్టర్, పాడేరు ఆర్టీసీ డీఎంకు ప్రజల సంతకాలతో కూడిన వినతి పత్రాలు అందజేసినా బస్సు సేవలు అందుబాటులోకి రావడం లేదు. కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలి.

– **తెరవాడ వెంకటరావు,** జామిగుడ పంచాయతీ, పెదబయలు మండలం

బిక్కుబిక్కుమంటూ ప్రయాణం



తారురోడ్డు సదుపాయం ఉన్న కూటమీ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సేవలు కల్పించాలి. దీంతో ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితిలో జీపుల్లో, ఆటోల్లో, ప్రయివేటు వ్యాన్లు ఇతర వాహనాల్లో పరిమితికి మించి ఎక్కి ప్రయాణం చేయాల్సి వస్తుంది. కొన్నిసార్లు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్న ప్రయాణం తప్పడం లేదు.ప్రజలకు రవాణా సదుపాయం కల్పించాల్సిన ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలి.

– **సందడి ఆనంద్,** కొరవంగి గ్రామం, పెదబయలు మండలం

ప్రతిపాదనలు పంపాం

పాడేరు ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత ఉంది. కొత్త రూట్లకు బస్సు సదుపాయం కోసం ప్రభుత్వానికి నివేదించాం. పాడేరు నుంచి విజయనగరం, విజయవాడ, లోతేరు ప్రాంతాలకు బస్సు సదుపాయంతో పాటుగా ఎస్పీ కార్యాలయం నుంచి కూడ కుమడ నుంచి భూషిపుట్టు మీదుగా జామిగుడ వరకు బస్సు సదుపాయం కల్పించాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు సదుపాయం ఉన్న అన్ని ప్రాంతాలకు దశల వారీగా ఆర్టీసీ సేవలు అందించాం. పాడేరు కుమడ ఆర్టీసీ బస్సుకు జామిగుడ వరకు నడిపే విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సర్వీసు పొడిగించడం జరుగుతుంది.

– **టి.ఉమామహేశ్వరరెడ్డి,** ఆర్టీసీ డీఎం, పాడేరు

ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతికి ఉచిత విద్య

హుకుంపేట: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో విద్యనభ్యసించేందుకు ఎటువంటి ఫీజులు చెల్లించకుండా ఉచితంగా చదువుకునేందుకు ఉన్నతాధికారులు ఆదేశించినట్టు ఎంఈవోలు సోమేలి చెల్లయ్య, ఈశ్వరరావులు తెలిపారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలోని ఆలివ్ గ్రీన్ ఇంగ్లీష మీడియం ప్రైవేట్ పాఠశాల, బీవికే ప్రైవేట్ ఇంగ్లిస్ మీడియం పాఠశాలల యాజమాన్యంతో వారు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు 1వ తరగతి చదువుకునే పిల్లలకు ఫీజులు చెల్లించకుండా విద్యను అందించాలన్నారు.

గంగాలమ్మ తల్లి ఉత్సవాలు ప్రారంభం



గ్రామదేవత గంగాలమ్మ తల్లి

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో సోమవారం గ్రామదేవత గంగాలమ్మ సంబరాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సంబరాలు మూడు రోజుల పాటు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన గంగాలమ్మ అలయం వద్ద తొలుత గ్రామరక్షణ కోసం అమ్మవారి మేలుకొలుపు కార్యక్రమం జరిగింది. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకొంటూ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘటం ఊరేగింపు, గరగనృత్యాలు, అమ్మవారికి ఉయ్యాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం రాత్రి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



జీకే వీధిలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గూడెంకొత్తవీధి: సంపూర్ణ పోషకాహారంతో గర్భిణిలు,బాలింతలు రక్తహీనతకు దూరంగా ఉండవచ్చునని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వలసమ్మ, డి.మోహిని, రామలక్ష్మిలు అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా సోమవారం దుచ్చరిపాలెం సెక్టార్ పరిధిలోని పెదవలస, దేవరాపల్లి గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్యవివాహాలు, బిడ్డ ఎదుగుదల తదితర విషయాలపై అవగాహన కల్పించినట్టు సూపర్‌వైజర్లు తెలిపారు.



ఎటపాకలో మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

ఎటపాక: చిరుధాన్యాలతో తయారుచేసిన పోషకాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీడీపీవో విజయగౌరి అన్నారు. ఎటపాక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో పొందే పోషక విలువలను వివరించారు. రాగులు, సజ్జలు, కొర్రలు తదితర తృణధాన్యాల ప్రాధాన్యతను తెలియజేశారు. గర్భిణులు, శిశువులు, చిన్నారులు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించాలన్నారు ఎంఈఓ రాజులు, ఈఓపీఆర్డీ గంగరాజు, సూపర్‌వైజర్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

అడ్డతీగల: మండలంలోని వీరభద్రపురంలోని ఎంపీపీ పాఠశాలలో భవిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతులుగా రెండు విభాగాలుగా విభజించి నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను రిటైర్డ్ ఎంఈవో రామారావు, విద్యా కమిటీ చైర్మెన్ వై.బుల్లమ్మాయి చేతుల మీదగా అందజేశారు. విద్యార్థుల్లో వాగ్ధాటి పెంచడం, విషయ పరిజ్ఞానంపై అవగాహన పెంచే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు భవిత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరికూటి ప్రభుదాస్ తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో ప్రసాద్, హెచ్‌ఎం కాంతారావు

చింతపల్లి: పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఉపాధ్యాయులు తర్ఫీదునివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఈవో పనసల ప్రసాద్ అన్నారు. మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో గల పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిత విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎనిమిదవ తరగతి చదువుతూ నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బాలరాజు, అనూక్, శ్యామ్‌సన్, ఉదయభానులను ఎంఈవో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా 9వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకూ ప్రభుత్వం ప్రతి ఏటా రూ.12వేలు ఉపకార వేతనాన్ని అందిస్తుందన్నారు. ఈ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థుల ఎంపికకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందిస్తున్నామన్నారు. హెచ్‌ఎం కుడుముల కాంతారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆశీల వసూలుకు వేలంపాట రేపు

అడ్డతీగల: వారపు సంతతో పాటు రోజువారీ ఆశీలు వసూలుకు బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు అడ్డతీగల గ్రామకార్యదర్శి పల్లాల పద్మలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆశీలు వసూలు హక్కులు పొందడానికి వేలంపాట ఏర్పాటుచేశామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు గిరిజనులై ఉండాలన్నారు.ఈ మేరకు ధరావత్తు సొమ్ము రూ.5 వేలు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గ్రామ వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

ముంచంగిపుట్టు: గ్రామ వలంటీర్ల కోసం కూటమి ప్రభుత్వం కొత్త జీవోను తీసుకురావాలని గ్రామ వలంటీర్ల మండల సంఘం అధ్యక్షుడు గోల్లోరి దేవ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వలంటీర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ జీవో నెంబర్ 3 బదులుగా కొత్త జీవో తీసుకువస్తామని ప్రకటించారు. అదే విధంగా వలంటీర్ల కోసం సైతం ప్రత్యేక జీవోను తీసుకువచ్చి, వలంటీర్లను కొనసాగించాలని, ఎన్నికల ముందు రూ.10వేలు వేతనం ఇస్తామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వలంటీర్ల వ్యవస్థకు ఎటువంటి జీవో లేదని చెప్పి, వేలమంది వలంటీర్ల కుటుంబాలను



సమావేశంలో మాట్లాడుతున్న వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు దేవ

ప్రభుత్వం రోడ్డున పడేసిందన్నారు. ప్రభుత్వం కొత్త జీవోను తీసుకువచ్చి వలంటీర్లను విధులలోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. చిన్నయ్య, భానుమూర్తి, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవానికి ముస్తాబవుతున్న చింతపల్లి



చింతపల్లి బస్ కాంప్లెక్సులో ఏర్పాటు చేస్తున్న ఎగ్జిబిషన్



చింతపల్లి పాత బస్‌స్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న భారీ విద్యుత్ దీపాలంకరణ సెట్టింగ్

చింతపల్లి: ముత్యాలమ్మ తీర్థ మహోత్సవానికి మండల కేంద్రం చింతపల్లి ముస్తాబవుతోంది.ఈ నెల 24 నుంచి 27తేదీ వరకు ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా సాయిబాబా ఆలయం నుంచి డిగ్రీ కళాశాల వరకు, అన్ని వీధుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఆలయం ప్రాంగణం, సబ్‌జైల్ జంక్షన్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు స్టేజీలను ఏర్పాటు చేస్తున్నారు.ఈ ఉత్సవం సందర్భంగా బస్ కాంప్లెక్సు ఆవరణలో భారీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో చింతపల్లి ఉత్సవ శోభను సంతరించుకుంది.

నేడు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు



చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

వి.ఆర్.పురం; పోలవరం నిర్వాసితులకు మంగళవారం గ్రామసభలు నిర్వహిస్తునట్టు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ గ్రామ సభలు పోలవరం మొదటి ఫేజ్ 1బి లో ముంపునకు గురవుతున్న మండలంలో రామవరం, రామవరం పాడు, అడవివెంకన్నగూడెం, గుండుగూడెం ప్రత్తిపాక గ్రామాల్లో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ గ్రామసభల్లో ప్యాకేజీకి అర్హులు, అనర్హుల వివరాలు వెల్లడించనున్నట్టు పేర్కొన్నారు. ప్యాకేజీకి సంబంధించి లబ్ధిదారులకు ఎటువంటి అభ్యంతరాలున్నా గ్రామసభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయవచ్చన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి



ప్రభుత్వ బడులను కాపాడాలంటూ ర్యాలీ చేస్తున్న యూటీఎఫ్ నేతలు,విద్యార్థులు



కొత్తపల్లిలో పాఠశాలను కొనసాగించాలని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు



గంగవరం మండలం పెదగార్లపాడులో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ముంచంగిపుట్టు/గంగవరం/రాజవొమ్మంగి: ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని, కోరుతూ యూటీఎఫ్ నాయకులు ముంచంగిపుట్టు, జి.మాడుగుల, గంగవరం, రాజవొమ్మంగి మండలాల్లో సోమవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలన్నారు. ఊరిలో ఉండే ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాయకులు రాజు, ధర్మారావు కృష్ణ, వెంకటేశ్వరరావు, రాంబాబు, రుక్మిణిదేవి తదితరులు, శ్రీనివాస్, పైడిమల్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను విలీనం తగదని , దానిని యథావిధిగా కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తిక్‌శ్రీను, కార్యదర్శి జీవన్‌కృష్ణ డిమాండ్ చేశారు. కొత్తపల్లిలో ప్రజలు, విద్యాకమిటీ తీర్మానం లేకుండా ఎంఈవో ఎంపీపీ పాఠశాలలోని 1,2తరగతులు విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రానికి, 3,4,5తరగతులను ఆశ్రమ, ఇతర పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారన్నారు. అలాగే గ్రామస్తుల అంగీకారం లేకుండా సంతకాలు కూడా చేయించారని వారు అన్నారు.దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

భక్తులకు భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో భక్తులు

గంగవరం : శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా స్థానిక సీతారామాలయంలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక యువకులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. భారీగా భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



రింతాడలో ఎప్రోచ్‌రోడ్డు విస్తరణ పనులు

గూడెంకొత్తవీధి: మండలంలోని చాపరాతిపాలెం నుంచి రింతాడ మీదుగా లంబసింగి వరకూ 516 ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రింతాడ కూడలిలో జాతీయ రహదారికి ఆనుకుని గూడెంకొత్తవీధి మీదుగా సీలేరు వెళ్లే ప్రధాన రహదారి కూడలి ఉంది. జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఈ కూడలి రహదారి మార్గం ఇరుగ్గా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారింది. జాతీయ రహదారిని అనుసంధానిస్తూ అప్రోచ్‌రోడ్డు నిర్మాణం విస్తరణకు ఇప్పటికే భూసేకరణ జరిగింది. ఇందులో భాగంగా జాతీయ రహదారి విభాగం అధికారులు జాతీయ రహదారికి సమాంతరంగా సీలేరు వెళ్లే ప్రధాన మార్గాన్ని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

కూటమి ప్రభుత్వంలో అక్రమాలు, కుట్రలు



రామకృష్ణదొర

రంపచోడవరం: దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో అక్రమాలు, కుట్రలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పండా రామకృష్ణదొర బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రంపచోడవరంలో ఒక హాస్టల్ నిత్యావసర సరకులు అక్రమ రవాణా చేయడం చాలా దారుణమన్నారు. ఇటీవల వాడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఒక గిరిజన బాలిక ఆత్మహత్య చేసుకుని చనిపోయిందన్నారు. ఈ విషయంలో బాలిక తల్లిదండ్రులకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. అధికారులు సమగ్ర విచారణ అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తరగతి గదిలో సీసీ కెమోరాలు ఉన్నా పనిచేయని పరిస్థితులున్నాయన్నారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నుంచి శిశువు అపహరణ, బియ్యం అక్రమ రవాణా కేసు కూడా విచారణ పేరుతో గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వలనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నట్టు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం గిరిజనుల ప్రాణాలతో చెలగాటమాడుతుందన్నారు. రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ హాస్టల్ నుంచి బియ్యాన్ని, నిత్యావసరాలను అక్రమంగా అమ్ముకున్న వార్డెన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకుడు రాపాక సుధీర్ డిమాండ్ చేశారు. వార్డెన్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మరొకరు ఇలాంటి సంఘటనలకు పాల్పడే అవకాశం ఉండదన్నారు.


ముంపు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకుల పర్యటన



నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

చింతూరు/వి.ఆర్.పురం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల అధ్యయన కమిటీ సోమవారం చింతూరు , వి.ఆర్.పురం డివిజన్‌లలోని ముంపు మండలాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిహారం, పునరావాసం వంటి విషయాలను వారు అడిగి తెలుసుకున్నారు. మార్టిన్‌లూథర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, బుల్లిబాబు, పీసీసీ సభ్యుడు ఎండీ హబీబ్, స్థానిక నాయకులు అహ్మద్ అలీ, హనీఫ్, నరేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సదరం క్యాంపు



ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: మండలం ఎగువ ప్రాంతంలో మంగళవారం మారేడిమిల్లిలో, దిగువ ప్రాంతంలో బుధవారం అడ్డతీగల వైటీసీలోను సదరం క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె బాపన్నదొర తెలిపారు. మండల ఎగువప్రాంతానికి చెందిన పాతకోట, గుర్తేడు, కానివాడ, దారగడ్డ, బొడ్డగండి. చింతలపూడి పంచాయతీలలోని దివ్యాంగులు మారేడిమిల్లి క్యాంపురకు, దిగువప్రాంతానికి చెందిన వై.రామవరం, యార్లగడ్డ, పి.యర్రగొండ, చామగడ్డ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగులు, దాలిపాడు, కె యర్రగొండ, కోట, యర్రంరెడ్డిపాలెం, పంచాయతీలలోని దివ్యాంగులంతా అడ్డతీగల క్యాంపునకు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు. ఆధార్, రేషన్ కార్డులతోపాటు, సదరన్ తదితర ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకువెళ్ళాలని సూచించారు. కృత్రిమ అవయవాలు, అదితర ఉపకరణాలు మంజూరు చేస్తారని తెలిపారు. మండలంలోని వికలాంగులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంటులు తప్పనిసరిగా క్యాంపులకు హాజరుకావాలని ఎంపీడీవ ఆదేశించారు.